

గోతులను పూడ్చిన పోలీసులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల బాలికల హాస్టల్ ఎదురుగా రహదారిపై ఏర్పడిన గోతులను పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు, స్థానిక ఎస్సై సూర్యనారాయణ స్వయంగా చొరవ తీసుకొని గోతులను పూడ్చే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ సన్యాసి నాయుడు మాట్లాడుతూ, నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారిందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అలాగే అంబులెన్స్ వాహనాలు తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో గోతులను పూడ్చడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గోతులను పూడుస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నేతలు

ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

-యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహనరావు- అనంతగిరిలో రణభేరి జీపు జాతా

ప్రజాశక్తి -అనంతగిరి: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిం చడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఇందుకు నిరసిస్తూ రణభేరి జీపు జాతా కార్యక్రమం చేపట్టడం జరిగిందని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు రెడ్డి మోహన్ రావు, ఎస్.కిషోర్, పూర్వ మహిళ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయగౌరీలు అన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చిలకలగెడ్డ పాఠశాల వద్ద బుధవారం సాయంత్రం రణభేరీ జీపు జాత బృందం చేరుకుంది. అనంతగిరి మండల యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ దేవుడు ఆధ్వర్యంలో రణభేరి జాతాకు బృందానికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహన్ రావు మాట్లాడుతూ, ఈనెల 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5 బృందాలుగా వీడి పర్యటించి ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమానికి సిద్ధం చేసి ఈ కార్యక్రమాన్ని శ్రీకారం జరుగుతుందన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా సమస్యలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్యకు పరిష్కరించే దాఖలాలు లేవన్నారు. 12వ పిఆర్సి కమీషనర్ రాజీనామా చేసి 15నెలలు గడిచినా మరొకరిని నియమించలేదని విమర్శించారు. వేలాది కోట్లుగా పేరకుపోయిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.సిపిఎస్ ని రద్దు సేసి ఓపిఎస్ గా మార్చేందుకు ప్రభుత్వంలో చిత్తశుద్ధి లేదన్నారు. సమస్యలు సత్వరమే పరిష్కరించకపోతే పోరాటాన్ని తీవ్ర రూపం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల. యుటిఎఫ్ నాయకులు ఎస్. రాంబాబు, మల్లేష్. పడాల్, మండల కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

రోడ్డు పనులు చేపట్టాలి

గిరిజనుల వినూత్న నిరసన



రైవాడ జలాశయంలో దిగి నిరసన చేపడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-అనంతగిరి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు ప్రారంభమైన రోడ్డు పనులను ఫారెస్టు అభ్యంతరలతో నిలిచిపోయాయని, తక్షణమే రోడ్డు పనులు చేపట్టాలని గ్రామానికి చెందిన గిరిజనులు రైవాడ జలశయంలో మునిగి చేతులు జోడించి వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ, మండలానికి మారుమూల పిన్నకోట పంచాయతీ పరిధి సొల్లుబంగికి కనీసం రోడ్డు సౌకర్యం లేక 13 మంది విద్యార్థులు రైవాడ డ్యామ్ మీదుగా పైగా నాటు బోటు పై రాకపోకలు సాగిస్తూ చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని తెలిపారు.నాలుగు నెలల క్రితం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్త కథనానికి స్పందించిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రూ 3. కోట్ల 60 లక్షలు నిధులు మంజూరు చేయగా సంబంధిత అధికారులు ఎట్టకేలకు రోడ్డు పనులు మొదలు పెట్టడంతో ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారన్నారు. దీంతో రోడ్డు పనులు నిలిచిపోవడంపై జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు పనులు పున్ణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ

సర్వసభ్య సమావేశంలో తీర్మానం



ఎంపిపికి హైడ్రో పై వ్యతిరేక తీర్మానం అందజేస్తున్న ఎంపిటిసిలు, సర్పంచులు,

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలంలోని బుధవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది.హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు, నవయుగ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని సర్పంచ్లు, ఎంపిటిసిలు ముక్తకంఠంతో వ్యతిరేకంగా తీర్మానం చేశారు.హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాన్ని రద్దు చేయకపోతే భవిష్యత్తులో పోరాటం మరింత ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, బెర్రీ బొరర్ కీటక తెగులతో సుమారు 3 వేలు ఎకరాలు తీవ్రంగా నష్టపోయిందన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి, పచ్చి కాపీ కాయలను కిలో రూ 200 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బెర్రీ బొరర్ కీటక తెగులు నివారణకు ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అరకువెల్లి మండలం లోతేరు, ఇరగాయి, బొండం, గన్నెల పంచాయతీ పరిధి గ్రామాల సుమారు 1200 మంది రైతులకు పోడు పట్టలు పంపిణీ చేయలేదన్నారు.ఈ పంచాయతీలు అనంతగిరి మండలం ఫారెస్ట్ రేంజ్ లో ఉండడంతో ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడంతో మంజూరు కాలేదని ఫారెస్ట్ అధికారులు తక్షణమే అనుమతి ఇచ్చి పట్టాలు పోడు పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అరకువెళ్లి మండలం 14 పంచాయతీ పరిధిలో పోడు పట్టాలు సర్వేలు చేసి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. రైతులకు పట్టాలు పంపిణీ చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సర్వసభ సమావేశంలో ఎంపీడీవో ఎం లోవరాజు, జెడ్పిటిసి శెట్టి రోషిని, మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మి, వైస్ ఎంపీపీలు ె రామన్న, కె సుమాంజలి, సర్పంచులు,ఎంపిటిసిలు వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

19న హైడ్రోపై ధర్నాను జయప్రదం చేయండి

అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని ఈ నెల 19 న హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరిగే ధర్నాను గిరిజనులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కిల్లో నాబో పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం జరిగితే పలు గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉందని, ఇక్కడ నివశిస్తున్న ప్రజలతోపాటు పంట పొలాలు, జిరాయితీ భూములు జలసమాధి అవుతాయని తెలిపారు. హైడ్రో ప్రాజెక్ట్ నవయుగ కంపెనీ వ్యక్తులు గ్రామాల్లో తిరిగి డ్రోన్ కెమెరాలతో సర్వే చేస్తుండడంతో గిరిజనులు భయభ్రాంతులకు గురి అవుతున్నారని పేర్కొన్నారు.

కార్వాన్ పార్క్‌లకు స్థలాల గుర్తింపు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పాడేరు : ఏజెన్సీలో కార్వాన్ పార్క్‌ల ఏర్పాటుకు ఐదు స్థలాలు గుర్తించామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. పాడేరు డివిజన్ లో మూడు, రంపచోడవరం లో రెండు స్థలాలు గుర్తించడం జరిగిందన్నారు. బుధవారం ఐదు మండలాల తహశీల్దారులు, ఎంపిడిఓలు, పర్యాటక శాఖ ప్రాజెక్ట్ అధికారులు, పంచాతి రాజ్ అధికారులతో పర్యాటక అభివృద్ధి లో భాగంగా గిరిజన ప్రాంతాలలో కార్వాన్ టూరిజం ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరం లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన గ్రామాల్లో కార్వాన్ టూరిజం ఏర్పాట్లుపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎపిటిడిసి ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన స్థలాలో సమస్యలు ఏమైనా ఉంటే త్వరితగతి పరిష్కారం చేయాలనీ ఆయ మండలాల తహశీల్దారులను ఆదేశించారు. ప్రైవేటు స్థలాలు గుర్తించిన వాటికి బదులుగా ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని సూచించారు. సెప్టెంబర్ 27 వరల్డ్ టూరిజం డే నాడు పి యం నరేంద్ర మోడీ హోమ్ స్టే పోస్టర్ ఆవిష్కరణ చేస్తారని పేర్కొన్నారు. జిల్లా మొత్తం 147 హోమ్ స్టే ఆమోదం అయాయిని పేర్కొన్నారు. ట్రైబల్ టూరిజం కౌన్సిల్ ఏర్పాటు, గిరిజన అభివృద్ధి ఫండ్ సమకూర్చడంపై అధికారులకు పలు సూచనలు చేసారు. హోమ్ స్టే నిర్వాహకులకు ఆతిథ్యం పై శిక్షణ అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ, రంపచోడవరం చింతూరు శుభం నక్వాల్, సీనియర్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ నిషిత గొఎల్, ఆర్కిటెక్ట్ కన్సల్టెంట్ ఎన్ కలేస్వర్, డిపిఒ కె.పి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

భీమా చెక్కు అందజేసిన కలెక్టర్,

పాడేరు: సహజ మరణానికి ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన చెక్కును . హుకుంపేట మండలం అమరు గ్రామానికి చెందిన పాంగి రాధా, హుకుంపేట మండలం ఓల్డ్ బెడ్డ గ్రామానికి పాంగి సొన్న మరియు హుకుంపేట మండలం సిద్ధిపుట్టు గ్రామానికి చెందిన జేజి గంగరాజు సహజ మరణం పొందిన వారి నామీని కుటుంబ సభ్యులకు బుధవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తన ఛాంబర్ లో పియమ్ జెజెవై కేంద్ర ప్రభుత్వం భీమా ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జనని సురక్షా క్యాంపైన్ సెప్టెంబర్ 30వ తేదీ వరకు జిల్లా వారీగా 430 గ్రామ పంచాయతీల్లో అవగాహనా సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఎల్‌డి యమ్ మాతు నాయుడు అన్నారు.

డిమాండ్ల సాధనకు మరిన్ని ఉద్యమాలు

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బేబీ రాణి
- ఉత్సాహంగా అంగన్‌వాడీ జిల్లా రెండో మహాసభ
- 37 మందితో నూతన కమిటీ

ప్రజాశక్తి-రంపచోడవరం: అంగన్‌వాడిల డిమాండ్ల సాధనకై మరిన్ని ఉద్యమాలు చేపట్టాలని అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. బుధవారం రంపచోడవరం ఆర్సి భవన్‌లో యూనియన్ రంపచోడవరం జిల్లా రెండో మహాసభ జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అంగన్‌వాడి అనుబంధ సంఘం సిఐటియు జెండాను అంగన్‌వాడి యూనియన్ సీనియర్ నాయకురాలు బుల్లెమ్మ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, ఐద్వా జిల్లా నాయకురాలు బేబీ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, రాష్ట్ర నాయకులు బొప్పెన కిరణ్, తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజులు పాటు అంగన్వాడీలు చేసిన సమ్మెలో భాగంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరుతో పని చేయని సెల్‌ఫోన్లతో మానసిక ఒత్తిడికి గురై ఎంతోమంది అంగన్‌వాడిలు గుండెపోటుతో మృతి చెందారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో పదివేల లోపు ఆదాయం వచ్చే వారికి అన్ని సంక్షేమ పథకాలు వర్తింపచేస్తామని చెప్పూనే రూ.7వేల వేతనం వస్తున్న మినీ వర్కర్స్, హెల్పర్స్‌కి మాత్రం సంక్షేమ పథకాలు వర్తింప చేయకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలకు ప్రతి శ్రామికుడు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్, బిఎస్ఎన్ఎల్, విద్యుత్, ఇలా అనేక సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. అంగన్‌వాడి జిల్లా నాయకులు సింగారమ్మ, లక్ష్మి బేబీ, జె,పార్వతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 37 మందితో నూతన కమిటీని మహాసభ ఎన్నుకోవడం జరిగింది. 15 మందితో ఆఫీస్‌బేరర్స్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బి నిర్మల, అధ్యక్షులుగా ఎం.రాజేశ్వరి, గౌరవ అధ్యక్షులుగా పల్లపు వెంకట్, కోశాధికారిగా కె.రామలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కలిన్కోట వెంకటలక్ష్మి, కొర్రపు రాణి, గొల్లపల్లి నూకరత్నం, బండారు సూర్యకుమారి, కారం శారద, సహాయ కార్యదర్శులుగా లక్ష్మి, ప్రసన్న, సునీత, కారం జానకిలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్



నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు

అన్నవరం-ఉమ్మడివరం బ్రిడ్జి నిర్మించాలి

ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి రంగారెడ్డి

వాడివేడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న పులిసంతోష్‌కుమార్

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: రేఖపల్లిలోని ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు హాజరయ్యారు. ఎంపిపి కారంలక్ష్మి, జడ్పిటిసి, వాళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ అన్నవరం ఉమ్మడివరం మధ్యలో బ్రిడ్జి కూలిపోవడంతో 40 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే తాత్కాలంగా బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ముంపుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క రైతుకి యూరియా సరఫరా చేయాలని ముంపులో లేని గ్రామాలను ముంపులో ఉందని చెప్పడం, ఉన్నవాటిని లేవని చెప్పడం సరి కాదన్నారు. అధికారులు స్పందించి తక్షణమే యూరియా అందించాలని, విత్తనాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను నిలదీశారు. స్పందించిన అధికారులు అన్ని గ్రామాల రైతులకు యూరియా అందిస్తామని సమాధానమిచ్చారు. తుమ్మిలేరు, పోచవరం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు వెళ్లిన వారికి బియ్యం, పెన్షన్ కోసం వారికి ఇచ్చిన కాలనీ నుండి విఆర్‌పురం మండలానికి 200 రూపాయలు ఛార్జి అవుతుందని వారికి ఆ కాలనీలో పెన్షన్ అక్కడే అందించాలని అధికారులకు తెలిపారు. చిన్నమట్టపల్లి ఎంపిటిసి పూనం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ చిన్నమటపల్లి, గుర్రంపేట, రామవరం, వెంకన్న గూడెం, ముంపులో ఉన్నాయని ఎరువులు, విత్తనాలు ఇవ్వడం లేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. స్పందించిన అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అందరికీ ఎరువులు, విత్తనాలు అందిస్తామన్నారు. తహశీల్దార్ సరస్వతి, ఎంపిడిఒ ఇమ్మానుయేల్, వైస్ ఎంపిపిలు వడ్డాణపు భాగ్యలక్ష్మి, ఎంపిటిసిలు వాళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి జయలక్ష్మి, సర్పంచ్‌లు పూనం సరోజిని, వెట్టి లక్ష్మి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి కారంలక్ష్మి

ఈ క్రాప్ సర్వే చేసి యూరియా ఇవ్వాలి

రామవరం పంచాయతీలోని గ్రామాల ప్రజలకు, పెద్దమట్టపల్లి పంచాయతీలోని గుర్రంపేట, నూతిగూడెం, రాజుపేట పంచాయతీ తోటపల్లి, శ్రీరామగిరి, జీడిగుప్ప పంచాయతీల గ్రామాల్లోని ప్రజలకు ఈనెల 21 లోపు ఈ క్రాప్ సర్వే చేసి అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వకుంటే 22న మండల కేంద్రంలో మహా ధర్నా చేపడతామని విఆర్‌పురం మండల ప్రజా ప్రతినిధులు , ఎంపిపి, సర్పంచులు, ఎంపిటిసిలు సర్వసభ్య సమావేశం అనంతరం పత్రికా ముఖంగా తెలియజేశారు.



వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

'సమస్యలను పరిష్కరించండి'

ప్రజాశక్తి-కొయ్యూరు: తమ సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తామని సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎంపిడిఒ బాలమురళీకృష్ణకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరు సంవత్సరాలు పాటు ఒకే క్యాడర్‌లో పనిచేసిన వారికి ఎఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డ్‌అసిస్టెంట్ క్యాడర్‌లో జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా మార్పు చేయాలని, అన్ని విభాగాల వారీగా ప్రమోషన్లు ఛానల్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాల వారీగా సీనియార్టీ జాబితా విడుదల చేయాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 1,25,000 మంది సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి 15 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -రంపచోడవరం : 11 కెవి రంపచోడవరం ఫీడర్, 33 కె.వి మారేడుమిల్లి ఫీడర్, 11కె.వి ఇందుకూరుపేట ఫీడర్‌లో ఫ్రైడే మైంటెనెన్సులో భాగంగా లైన్ల మరమ్మతులు, ట్రీ ట్రిమ్మింగ్ నిర్వహిస్తున్నందున రంపచోడవరం, సిరిగిందలపాడు మారేడుమిల్లి మండల పరిసర ప్రాంతాలకు, గంగవరం మండలం పెదగార్లపాడు నుండి మొల్లేరు వరకూ ఉన్న గ్రామాల్లో దేవీపట్నం మండలం ఉప్పయ్యపాలెం నుండి శరభవరం పరిసర ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాబ్రియేల్ తెలిపారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - రంపచోడవరం : మండల కేంద్రంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని 'ప్రజాశక్తి' దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు రంపరోడ్డు, రెడ్డిపేటలోని అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లారు. గ్రామస్తులు ప్రజాశక్తి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.



చెత్త తొలగించిన దృశ్యం

పిఏసిఎస్‌లు పారదర్శకంగా పనిచేయాలి

ఎమ్మెల్యే శిరీషాదేవి

రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షులుగా ముప్పన కేశవ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు పారదర్శకంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే శిరీషదేవి, తెలుగు యువత అధ్యక్షులు ఎం విజయ్‌భాస్కర్ అన్నారు. స్థానిక జయలక్ష్మి థియేటర్‌లో బుధవారం పిఏసిఎస్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర పరిశ్రమలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తూ సకాలంలో తిరిగికట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. సొసైటీల్లో సభ్యుల సంఖ్య పెంచుతూ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. నూతనంగా ఎన్నికైన సొసైటీ అధ్యక్షులు ముప్పన డింబకేశవను సన్మానించారు. కార్యవర్గం గతపాలకవర్గం కంటే మెరుగ్గా పాలన అందించాలన్నారు.



కేశవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి తదితరులు

కేశవ్‌ను సన్మానించిన పూర్వ విద్యార్థులు

1990-91లో పదోతరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు రాజవొమ్మంగి మండల సొసైటీ అధ్యక్షులు ముప్పన కేశవ్‌ను గజ మాలతో సత్కరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సమస్యలపై విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఉద్యమం


విరాళం అందిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: డిసెంబరు 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభల సందర్భంగా బుధవారం అరకులోయ మండలం ఎండపల్లి వలస ట్రాన్స్‌కో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావుకు విరాళాలు అందించారు. ఈ మహాసభలో విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమించేందుకు ప్రణాళిక రూపొందిస్తారన్నారు.కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని,పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.కోటి రూపాయలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని,పిఆర్సి ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ లిమిటెడ్ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, రామారావు, ఆలీ, చందు, సాహు,కిండంగి రామారావు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న ఐటిడిఎ పిఒ శ్రీపూజ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మండలం చింతలవీధిలో గణేష్ నిమజ్జోత్సవంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఎపి రాష్ట్ర గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం పరామర్శించారు. నిమజ్జన వేడుకలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు కొర్ర సీతారం, గుంట కొండబాబు, వంతల దాలిమ్మలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేందుకు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నరేంద్రనాథ్ చౌదరి, అల్లూరి జిల్లా కార్యదర్శి రామయ్య, సహాయ కార్యదర్శి అప్పారావు, అల్లూరి జిల్లా సంపర్క ప్రముఖులు బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి


ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-చింతపల్లి : వైసిపి ప్రభుత్వ హయాంలో చింతపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వంలో ఈ మార్కెట్ యార్డు అభివృద్ధి కృషి చేయడం జరుగుతుందని టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం టిడిపి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అధ్యక్షతన బుధవారం జరిగింది.

చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కిలో ఊర్మిళ, వైస్ చైర్మన్‌గా రొబ్బ యశ్వంత్, 14 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈశ్వరి మాట్లాడుతూ 2026 జనవరిలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏజెన్సీలో కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి గిఫ్ట్‌గా అందించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో చింతపల్లి, పాడేరు కోఆపరేటివ్ బ్యాంకుల చైర్మన్ గెమ్మెలి అబ్బాయి నాయుడు, టిడిపి, జనసేన నాయకులు గోవిందరావు, వంతల బుజ్జిబాబు, గొర్ల వీరవెంకట, పోత్తూరు కొండబాబు, సాగిన బాలరాజు, నళినీ కృష్ణ, ఆంద్రాబు లక్ష్మయ్య, లక్కోజు నాగభూషణం పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు


హుకుంపేట వైద్యశిబిరంలో డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన స్వస్థ్ నారి పరివార్‌లో భాగంగా అరకు సచివాలయంలో మంగళవారం కిలోగూడ ప్రాథమిక వైద్యాధికారి నజీబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని డిఎంఓ కమల ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంఓ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య సంరక్షణ కొరకు ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. క్షయ, సికిల్ సెల్ ఎనీ మియా, క్యాన్సర్ తో పాటు గర్భిణీ మహిళలకు సంబంధించిన వ్యాధులతోపాటు పలు రకాల దీర్ఘ కాలిక వ్యాధులపై నిత్యం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారి కుమార్‌రత్న, ఎంపిపి బీ ఈశ్వరి, జడ్పిటిసి, సిహెచ్ జానకమ్మ, సర్పంచ్ జి శారద, ఎంపిటీసీలు వరహాలమ్మ దేవదాసు, పిహెచ్ఎన్ జానకి, పుష్ప పాల్గొన్నారు.

హుకుంపేట :హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి . విశ్వేశ్వరరావు నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించాలన్నారు. అత్యవసర వైద్యం అవసరమైన వారికి రెఫరల్ సేవల ద్వారా ఉన్నతాసు పత్రులలో చేర్పించి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి కమలాకర్ వైద్యాధికారి శ్రీ లక్ష్మి, పాల్గొన్నారు.

మోతుగూడెం: అల్లూరి జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెంలో బుధవారం మోతుగూడెం పిహెచ్‌సిలో గర్భిణులు, బాలింతలు, శిశువులకు ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ నఫియా అభిజ్ఞ ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రతి గ్రామంలో క్యాంపులు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేటి సీత, ఎంపిటిసి వేగి నాగేశ్వరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు పిహెచ్‌సిలో 153 మందికి పరీక్షలు నిర్వహించామని డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌వల్లి వెల్లడించారు. స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడుతూ కలెక్టర్ వైద్యారోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర్‌నాయుడు ఆదేశాల మేరకు స్వస్థనారిసశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా సీలేరు పిహెచ్‌సిలో మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి హోమియో వైద్యాధికారి సృజనారాయ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ కోటిరెడ్డి, ముఖ్యఅతిథిగా బిజెపి మండల మాజీ అధ్యక్షులు డివిఎస్ రమణారెడ్డి (చిట్టిబాబు) ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పలువురు మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెం పిహెచ్‌సిలో 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా రాజేంద్రపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి హేమంత్, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. 135 మంది మహిళలకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు. కిశోరీబాలికలకు, గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు చేశారు. రాజేంద్రపాలెం సర్పంచ్ పీతా సింహాచలం ఐసిడిఎస్ బిపిసి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


చింతూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రణాళికలు

ఎయు స్పోర్ట్స్ బోర్డు సమావేశంలో విసి ఆచార్య రాజశేఖర్


మాట్లాడుతున్న ఎయు విసి ప్రొఫెసర్ రాజశేఖర్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విద్యార్థులకు క్రీడల నిర్వహణకు వీలుగా సింథటిక్ క్రీడామైదానం, ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్ స్టేడియాల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు, ప్రతిపాదనలు రూపొందించాలని ఎయు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్‌ను విసి ఆచార్య జిపి. రాజశేఖర్ సూచించారు. బుధవారం ఎయు పరిపాలనా విభాగం ఎగ్జిక్యూటివ్ సమావేశ మందిరంలో విసి అధ్యక్షతన వార్షిక స్పోర్ట్స్ బోర్డు సమావేశం నిర్వహించారు. గత ఏడాది పతకాలు సాధించిన ఎయు క్రీడాకారుల అభినందించారు.ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని యూనివర్శిటిలో అనుబంధ కళాశాలల విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, ఖోఖోక్రీడలు నిర్వహించనున్నామన్నారు. అనుబంధ ఎఎంఎఎల్ కళాశాలలో అంతర కళాశాలల క్రీడా పోటీలు నిర్వహణకు సమావేశంలో ఆమోదించారు. అన్నికళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ల నియామకాలకు ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. కళాశాలలకు క్రీడా మైదానాలు కూడా ఉండాలన్నారు. ఇతర యూనివర్శిటీల క్రీడలకు వెళ్లే క్రీడాకారుల డిఎ పెంపువిషయంలో ఆలోచన చేస్తామన్నారు.

ఎయు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్. విజయమోహన్ గత ఏడాది ఎయు క్రీడాకారులు సాధించిన పతకాలు గురించి వివరించారు. ఈ ఏడాది సౌత్ ఇండియా యూనివర్శిటీ క్రికెట్ పోటీలు ఎయు వేదికగా నిర్వహించేందుకు విసి సమ్మతించారన్నారు. ఎయు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి మాట్లాడుతూ డిఎస్‌సిలో తమవిభాగ విద్యార్థులు పలువురు ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ వెంకటేశ్వర్లు, ఒలింపియన్, పోర్టు మాజీ క్రీడాధికారి ఎం.మాణిక్యాలరావులను విసి సత్కరించారు. కార్యక్రమంలో డీన్ ఫ్యాక్టరీ ఆచార్య రాజేంద్రప్రసాద్, ఎయుఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహా రావు, డాక్టర్ ఎల్.బి కళాశాల వ్యాయామ విద్యావిభాగం హెడ్ డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎఎంఎఎల్ కళాశాల పీడీ డాక్టర్ నాయుడు, ఎవిఎన్ కళాశాల పీడీడాక్టర్ గోపీకృష్ణ, వివిధ కళాశాలల ప్రిన్సివల్స్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపునకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: అరకు నుంచి జైపూర్ జంక్షన్ మీదుగా ఒడిశాకు తరలిస్తున్న అక్రమ కోట బియ్యం తరలింపు పై సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న కోటా బియ్యంను మంగళవారం స్థానికులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అరకులోయ నుంచి ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి ఏడు గంటల లోపు ఈ రోడ్డు మీదుగా ఆటోలో అక్రమంగా జిసిసి రేషన్ బియ్యంను తరలిస్తున్నారని ఆరోపించారు. రేషన్ లబ్ధిదారులకు ఇచ్చే బియ్యంను సక్రమంగా వారికి అందించకుండా బ్లాక్ మార్కెట్లో జిసిసి అధికారులు విక్రయిస్తున్నారని చెప్పారు. తక్షణమే అక్రమ తరలింపును అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ అధ్యాపకుడు ఐ.రవీంద్ర నాయక్ మాట్లాడుతూ క్లోరోఫ్లోరో కార్బన్ల వాడకం పెరగడం వల్ల ఓజోన్ పొర దెబ్బతింటుందని, దీని వలన సూర్యుడి అల్ట్రావైలెట్ కిరణాలు భూమిని తాకి జీవరాశిపై శారీరక సమస్యలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. జువాలజీ అధ్యాపకుడు డాక్టర్ వి.రమణ మాట్లాడుతూ, భూమికి 25-45 కిలోమీటర్ల ఎత్తులోని స్ట్రాటోస్ఫియర్లో ఓజోన్ పొర విస్తరించి ఉంటుందని, దానిని కాపాడుకోవడం మానవాళి సమిష్టి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ అధ్యాపకురాలు డాక్టర్ డి.కేజియా, ఫిజిక్స్ అధ్యాపకురాలు శ్రావణి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


నివాళులర్పిస్తున్న జెసి అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి -పాడేరు: ప్రపంచంలో తొలి వాస్తు శిల్పి, సృష్టికర్త విశ్వకర్మ అని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ పూజ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, బిసి వెల్ఫేర్ అధికారి ఆర్. కృష్ణారావు, . విశ్వసంఘం ప్రెసిడెంట్ కొమ్ముజి వెంకటరమణ, అరకు పార్లమెంట్ బి.సి. సెల్ ఉపాధ్యక్షులు ఎల్ నాగభూషణం, వేమూరి సత్తిబాబు, కె లతాకుమారి, తేహజారాణి ఉన్నారు.

పరిశుభ్రమైన నీటిని తాగాలి


బావిలో బ్లీచింగ్ కలిపిస్తున్న సెక్రటరీ

ప్రజాశక్తి-హుకుంపేట:ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, శుభ్రమైన నీటిని వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలో పంచాయతీ పారిశుద్ధ్య పనులు బుధవారం చేపట్టారు. ప్రధాన రహదారులు, బస్టాండ్, మార్కెట్ యార్డు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేయించారు.వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని కార్యదర్శి తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కొయ్యూరు : నాటుసారా తయారు చేసి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మంప ఎస్ఐ శంకరరావు తెలిపారు. 70 లీటర్ల నాటు సారా పట్టుకున్నామని రేవళ్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి, సారాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించమన్నారు. అక్రమంగా మద్యం తయారీ, రవాణా చేస్తేకఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంపిడిఒగా కుమార్


కుమార్

ప్రజాశక్తి-అడ్డతీగల: అడ్డతీగల ఎంపిడిఒగా కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు అనంతగిరి మండలంలో ఎంపిడిఒగా పనిచేస్తూ బదిలీపై అడ్డతీగల వచ్చారు. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కెఆర్ విజయ విశాఖపట్నం ఎంపిడిఒగా వెళ్లారు. ఆమెకు ఉద్యోగులంతా ఘనంగా వీడ్కోలు పలికారు.

అక్రమ నిర్మాణాల నిలిపివేత

ప్రజాశక్తి- జికె వీధి : మండలంలోని రింతాడ గ్రామంలో 1/70 చట్టం ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై ఉపసర్పంచ్ మడపాల సోమేశ్వరరావు అధికారులకు ఫిర్యాదు చేయగా రెవెన్యూ సిబ్బంది బుధవారం విచారణ చేపట్టారు. గ్రామకంఠం భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని 1/70 చట్టాన్ని ఉల్లంఘించరాదని తగు చర్యల నిమిత్తం అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, అక్రమకట్టడాలు నిర్మించినా కూల్చివేస్తామని హెచ్చరించారు.

పాము కాటుతో చిన్నారి మృతి

ప్రజాశక్తి-జికెవీధి: మండలంలోని పెదవలస పంచాయతీ బొంతువలస లో ఐదోతరగతి చదువుతున్న మర్రి కవిత తన ఇంటిలో నిద్రిస్తున్నపుడు తెల్లవారు జామున పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు, గ్రామస్తులు ఫీడర్ అంబులెన్స్‌కి సమాచారం అందించి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే అంబులెన్స్ మరమ్మతుకు గురవ్వగా గ్రామస్తులు బైక్ ఏర్పాటు చేసి పెదవలస ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించి పాప మృతి చెందిన ఘటన పలువురిని కలచివేసింది. తల్లిదండ్రులు బోరున విలపించారు.

కేంద్ర గ్రామంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : మండలంలో గోకవరం ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కేంద్ర గ్రామంలో బుధవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ముఖ్తర్, శివ మోహన్, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ బాబు ఆధ్వర్యంలో సుమారు 300 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారని తెలిపారు. గ్రామంలో జ్వరాలతో కీళ్లనొప్పులతో బాధపడుతున్న పలువురు వైద్యపరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు తీసుకున్నారని తెలిపారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం

- సర్పంచ్ హేమంత్

ప్రజాశక్తి-కూనవరం: పంచాయతీ అభివృద్ధి చూసి ఓర్వలేక కొంతమంది విషప్రచారం చేస్తున్నారని కూనవరం పంచాయతీ సర్పంచ్ హేమంత్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 2023 మే 7న సర్పంచ్ రాజబ్బ మృతి చెందడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న తాను సర్పంచ్ బాధ్యతలు స్వీకరించానన్నారు. 2022లో వరదల్లో బాధ్యతగా పనిచేసినట్టు గుర్తు చేశారు. జెడ్పి ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

ఏజెన్సీ పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేయాలి


ఐటిడిఎ ఎదుట నిరసన తెలుపుతున్న యువత

ప్రజాశక్తి -రంపచోడవరం: ఏజెన్సీలో ఐదో షెడ్యూల్లో ఉన్న ప్రత్యేక హక్కులు, ఉపాధి అవకాశాలను పరిరక్షించాలని అమలు చేయాలని, 2025 మెగా డిఎస్సీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వల్ల గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ నియామకాలు గిరిజన ఆదివాసీ భర్తీ చేయాలన్నారు. బుధవారం ఐటిడిఎ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. లోతా రామారావు, వంతు బాలకృష్ణ, వెదుళ్ల రచ్చిరెడ్డి, ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 20న ధర్నా

డిమాండ్లు నెరవేర్చాలని ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ వినతి


ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి-సీలేరు: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు సెప్టెంబర్ 20న సీలేరు ఎపి జెన్కో ఎస్ఇ సివిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మణ్,విష్ణుకుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేయాలని ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని పిఆర్‌సి తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో యాజమాన్యం మొండివైఖరి అవలంభిస్తే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కూర్మారావు, వేదాల రాము, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వెదురు పుట్టకొక్కులకు భలే గిరాకీ


సీలేరులో విక్రయిస్తున్న వెదురు పుట్టకొక్కులు

ప్రజాశక్తి -సీలేరు: గిరిజనులు సేకరించిన వెదురు పుట్టకొక్కులకు భలే గిరాకీ ఏర్పడింది. జికెవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి కాట్రగెడ్డ పిల్లిగెడ్డ గిరిజనులు సమీప అటవీ ప్రాంతాల్లో ఎండిపోయిన వెదురు పొదల్లో పుట్టకొక్కులను సేకరించి సీలేరు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. వీటిలో పోషక విలువలు ఎక్కువగా ఉన్నట్లు భావిస్తారు. బుధవారం సీలేరు మార్కెట్‌కి తీసుకొచ్చి విక్రయించారు. వీటిని కొనుగోలు చేయడానికి స్థానిక గిరిజనులు ఆసక్తి చూపారు. ఈ పుట్టకొక్కులు ఆగస్టు, సెప్టెంబర్,అక్టోబర్‌లో ఎక్కువగా సేకరిస్తారు. మరోపక్క జొన్నమామిడి గ్రామ గిరిజనులు వెదురు పొదల్లో కురుడీలు సేకరించి సీలేరు మార్కెట్లో విక్రయాలు జరుపుతున్నారు. వీటిలో అధికంగా పోషకాలు ఉండడంతో ప్రజలు వీటిని కొనుగోలు చేసి వంటకాలుగా తయారు చేసి ఇష్టంగా తింటారు. వర్షాకాలం, శీతాకాలం వీటిని తినడం వలన పోషకాలతో పాటు శరీరంలో ఉష్ణోగ్రతని పెంపొందించుకోవడమే కాకుండా అధిక లాభాలు పొందవచ్చునని గిరిజనులు చెబుతున్నారు.

పాఠశాల ఏర్పాటు చేయరూ..!


పాఠశాల నిర్మించాలని కోరుతున్న పిల్లలు

ప్రజాశక్తి-కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ, జోగంపేట గ్రామంలో 30 మంది పిల్లలు ఉన్నా పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని గ్రామానికి చెందిన గెమ్మెలి కామేశ్వరరావు ఆరోపించారు. గ్రామానికి సమీపంలో ఉన్న సోలబు గ్రామంలో పాఠశాల ఉన్నా సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో వెళ్లివచ్చేందుకు పిల్లలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో అయితే గెడ్డ దాటి వెళ్లాల్సి వస్తోంది. జోగంపేటలో పాఠశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత ఏడాది ఆరు నెలలు ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేసి ఒక ఉపాధ్యాయుని నియమించారు. తరువాత మళ్లీ తొలగించారు. జోగంపేటలో పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా మూకుడుపల్లి రహదారి


మూకుడుపల్లి రహదారి

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని దొడ్డవరం నుండి లుసాం మీదుగా మూకుడుపల్లి రహదారి నాణ్యత లోపంతో వేయడం వలన అధ్వానంగా తయారైందని పరిసర గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అంతా గోతులు పడి రాకపోకలు చేయడానికి ఇబ్బందిగా ఉందని, వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని ఇప్పటికైనాసంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డు బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

గ్రేట్ ఇండియా ఫెస్టివల్‌లో భారీ డిస్కౌంట్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న అమెజాన్ గ్రేట్ ఇండియా ఫెస్టివల్‌లో గృహావసరాలకు సంబంధించిన ఉత్పత్తులపై 80 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నామని సంస్థ ప్రతినిధి నివాస్ తెలిపారు బుధవారం విశాఖలో ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ వ్యాయామ సామాగ్రిపై 70 శాతం, ఈవీ ద్విచక్ర వాహనాలపై రూ.26 వేల వరకు తగ్గింపు అందిస్తున్నామని వంట సామగ్రి, డైనింగ్ ఉత్పత్తులపై 50 శాతం, ఫర్నిచర్ హోమ్‌డెకర్ వస్తువులపై 45 శాతం వరకు అందిస్తున్నామని వీటితో పాటు నోకాస్ట్ ఇఎంఐ సౌకర్యంతో ఐసిఐసిఐ, ఎస్బిఐ, హెచ్‌డిఎఫ్‌సి, క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలు చేసే వారికి రూ.17,500 వరకు ప్రయోజనాలు చేకూరతాయని ఆయన అన్నారు. ప్రైమ్‌సభ్యులకు 24 గంటలు ముందుగానే అందుబాటులో ఉంటుందన్నారు.

ఉపాధ్యాయ బదిలీ జిఒలో 'రిక్వెస్ట్ గ్రౌండ్స్' పదం కొనసాగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఉపాధ్యాయుల బదిలీల కోసం విడుదల చేసిన జిఒలో రిక్వెస్ట్‌గ్రౌండ్స్ పదాన్ని తొలగించడం సరికాదని, దానిని యథావిధిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.దేముడు, ప్రధాన కార్యదర్శి జి.దత్తాత్రేయ శర్మ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి యూనియన్ తరపున లేఖ రాయడం జరిగిందని వారు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో 10 నుంచి 15 సంవత్సరాల పైబడి ఇతర ప్రాంతాల్లో పనిచేయటం వల్ల అనేక కుటుంబాలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. అంతర్ జిల్లాల బదిలీలు రిక్వెస్ట్ గ్రౌండ్స్‌పై కౌన్సిలింగ్ నిర్వహించడానికి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆన్‌లైన్ మోసాలు అదుపునకు 14సితో ఒప్పందం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: రానున్న పండగ సీజన్ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఉత్తేజభరితమైన డీల్స్, భారీ ఎంపికలు, అంతులేని షాపింగ్ అవకాశాలను తెచ్చిందని, అదే సందర్భంలో నకిలీ ఆఫర్లు, తప్పుదారి పట్టించే మెసేజ్‌లు కూడా ఉన్నాయని కస్టమర్లు అప్రమత్తంగా ఉండవలసిందిగా అమెజాన్ పబ్లిక్ రిలేషన్స్, కమ్యూనికేషన్స్ విభాగ డైరెక్టర్ అశ్విని సమ్రాజ్ తెలిపారు. ఈ మేరకు హోం వ్యవహారాల శాఖ ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌తో అమెజాన్ సంస్థ భాగస్వామ్యం చేసుకుందన్నారు. అమెజాన్ నుండి వచ్చినట్లుగా వివరించే అనుమానస్పద లింక్ లేదా ఏదైనా ఇతర షాపింగ్ వెబ్‌సైట్ గురించి మెసేజ్‌లను క్లిక్ చేయడానికి, భాగస్వామ్యం చేయడానికి, చెల్లించడానికి ముందు జాగ్రత్తగా ఉండవలసిందిగా కోరారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి బుధవారం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానిక నేతలు అధికారులు ఘనస్వాగతం పలికారు. జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి, ప్రభుత్వ విప్‌లు గణబాబు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్, విఎమ్ఆర్డిఎ కమిషనర్ కె.విశ్వనాథన్, జిసిసి ఎండి కల్పనాకుమారి, ఎపిఇపిడిసిఎల్ సిఎండి పథ్వితేజ్, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ ఎన్టీఆర్ వైద్యసేవ సీతంరాజు సుధాకర్, ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ చైర్మన్ గండిబాబ్జి వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు ఉన్నారు.

కలిసికట్టుగా పని చేయాలి


మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండల కేంద్రంలో బుధవారం టిడిపి పార్టీ మండల నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాడేరు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి పాల్గొని స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరవుతున్న తరుణంలో నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పదవులు రాలేదని చింతించవద్దని, పార్టీ అందర్నీ గుర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ లోబోరి అప్పలరాజు, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు, మండల అధ్యక్షులు వంతల కొండలరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి బోర్ర విజయ రాణి, పలువురు సర్పంచులు ఎంపీటీసీలు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు